నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

• కలెక్టర్ సంతోష్

మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, ఫిబ్రవరి 14 : ప్రస్తుత యాసంగి, రానున్న వేసవిలో నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ సంతోష్ జిల్లా విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యుత్‌శాఖ అధికారులతో శుక్రవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిలో డిమాండ్ దృష్ట్యా సరిపడా విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు గానూ అవసరమైన తక్షణ మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. వివిధ రకాల పనులు చేపట్టేందుకు రూ.50కోట్లతో జిల్లా వ్యాప్తంగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. వాటిలో ముఖ్యంగా అదనపు 33కేవీ, 11కేవీ, ఎల్‌టీ లైన్స్ వేసేందుకు 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో అదనపు పవర్‌ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. పనులను వేగవంతంగా చేపట్టి వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఫిబ్రవరి నెలవరకు పూర్తి చేయాలన్నారు. యాసంగి, వేసవిలో డిమాండ్ ఎక్కువ పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్‌శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ తిరుపతిరావు, ఆశాఖ అధికారులు రమేశ్‌బాబు, గోవింద్, నవీన్ బాబు పాల్గొన్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

జనరల్ దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

గద్వాలటౌన్, ఫిబ్రవరి 14: పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా దవాఖాన, ల్యాబ్, ఐసీయూల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం వేతనాల కోసం దవాఖాన ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ ఏడునెలలుగా వేతనాలు చె ల్లించడం లేదన్నారు. వేతనాలు చెల్లించాలని కోరితే టీవీవీపీ, డీఎంఈ శాఖలు ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ తమ కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సంబంధిత ఏజెన్సీకి చెందిన రామ్మోహన్ తమని బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వేతనాలు రాకపోవడంతో తమ కుటుంబాలు గడవటం ఇబ్బందిగా మారిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతామని హె చ్చరించారు. కార్యక్రమంలో రవికుమార్, పరశురాముడు, ఖలీల్, మంజూర్ హమ్మద్, శివన్న, మారుతమ్మ, వాణి పాల్గొన్నారు.

కేపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

బ్యాటింగ్ చేస్తూ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి14 : కొత్తకోటలో కొత్తకోట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 10 టీమ్‌లు పాల్గొంటాయని, మొత్తం 24 మ్యాచ్‌లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ. లక్ష, ద్వితీయ బహుమతిగా రూ. 50వేలుగా అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. పోటీల ప్రారంభ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, హరిన్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా పుల్వామా దాడిలో మృతిచెందిన అమర జవాన్లకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో మంచిగా రాణించి రాష్ట్ర, దేశ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాలని, దీని వలన భవిష్యత్‌లో క్రీడాకారులకు ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రావుల మాట్లాడుతూ క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని గెలుపోటములు ఆటలో సహజమని, ఎవరు గెలిచినా ఆటలో హుందాగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ రాంబాబు, హరిన్‌రెడ్డి, ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీను, ఎల్లంపల్లి నరేందర్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, గుంత శివ, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హాకీ పోటీలకు వనపర్తి పీడీలు

పోటీలకు ఎంపికైన పీడీ మన్నెంయాదవ్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14 : ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడలో జరుగనున్న రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలకు వనపర్తి ఫిజికల్ డైరెక్టర్లు ఎం.డీ షబ్బీర్, మన్నెంయాదవ్ ఎంపికయ్యారు. పెద్దమందడి ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న మన్నెంయాదవ్, పెబ్బేర్ మండలం సూగూరు పాఠశాలలో పనిచేస్తున్న ఎం.డీ షబ్బీర్ జనవరి 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో వీరిని జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక చేశారు. వీరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం జిల్లాకు ఎంతో గర్వకారణమని డీఈవో అబ్దుల్ ఘని, జిల్లా క్రీడల అధికారి సుదీర్ కుమార్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, వనపర్తి హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొలమోని కుమార్, నిరంజన్‌గౌడ్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కావలెను
★ మహబూబ్‌నగర్‌లో ప్రముఖ సోలార్ కంపెనీలో పనిచేయుటకు ITI ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ చేసిన వారు కావలెను. సంప్ర: 8686166354, 7842520780.
NT-MBNR

GOLD FINANCE
★ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

20లోగా వందశాతం నిధులను ఖర్చు చేయాలి

• కలెక్టర్ ఆదర్శ్ సురభి

సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14 : కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాకు పీఎం శ్రీ, సర్వ శిక్ష అభియాన్ కింద మంజూరైన నిధులను ఫిబ్రవరి 20లోగా వందశాతం ఖర్చు చేసిన నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సెక్రటరీ ఎడ్యుకేషన్ డా.యోగితా రాణా శుక్రవారం కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో వీసీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ ఎడ్యుకేషన్ డాక్టర్ యోగితా రాణా మాట్లాడుతూ పీఎంశ్రీ, సర్వశిక్షాభియాన్ కింద ప్రతి ఏడాది పాఠశాలలో మౌలిక వసతులు, క్షేత్ర స్థాయి పరిశీలనల కోసం విడుతల వారీగా నిధుల విడుదల చేస్తుందని, కానీ చాలా జిల్లాలో 50శాతం సైతం ఖర్చు చేయడం లేదని చెప్పారు. నిధులు ఖర్చు చేసి యూటిలైజేషన్ సర్టిఫికెట్ పంపిస్తే తిరిగి నిధులు విడుదల చేస్తారని చెప్పారు. అనంతరం కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తూ గ్రీన్ స్కూల్, ఆత్మ రక్షణ, క్షేత్రస్థాయి పరిశీలన, మౌలిక సదుపాయాలు, స్పోర్ట్స్, సైన్స్ బడ్జెట్ తదితర విభాగాలకు లక్షల్లో నిధులు విడుదల చేశారని వాటి ఖర్చులు మాత్రం జరగడం లేదన్నారు. ఫిబ్రవరి 20లోపు నిధులు అన్ని ఖర్చు చేయాలని, ఎంఈవోలు, పీఎంశ్రీ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పీఎం శ్రీ కింద జిల్లాలో 6 ప్రాథమిక పాఠశాలలు, 15 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, పీఎం శ్రీ పాఠశాలలు వారం రోజుల్లో నిధులు ఖర్చు చేసి నివేదిక ఇవ్వాలని, ఆపార్ నమోదు సైతం త్వరగా పూర్తి చేయాలని ఎంఈవోలను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఈవో అబ్దుల్ ఘని, ఎంఈవోలు, పీఎం శ్రీ హెచ్‌ఎంలు, పంచాయతీరాజ్ ఇంజినీర్లు తదితరులు ఉన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

• అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

గద్వాల, ఫిబ్రవరి 14 : జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో మహాశివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహాశివరాత్రి ఉత్సవాలపై సంబంధిత శాఖ అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ ఈవో, తాసీల్దార్, పోలీస్ అధికారులు సమన్వయం చేసుకొని పనులు చేపట్టాలన్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రసాదం పంపిణీ కోసం ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, అంగవైకల్యం ఉన్న భక్తులకు ప్రత్యేక సేవలు అందించాలని, క్యూలైన్‌లు సక్రమంగా ఏర్పాటు చేసి అన్నదానం ఏర్పాటు చేయాలన్నారు. వీఐపీ సందర్శన సమయంలో ప్రత్యేకంగా ప్రోటోకాల్ నిర్వహణకు సంబంధించిన చర్యలు చేపట్టాలని తాసీల్దార్‌కు ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం భద్రత ఏర్పాట్లు, సౌకర్యాలను పర్యవేక్షిస్తూ అన్ని ఏర్పాట్లు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలని తాసీల్దార్‌కు సూచించారు. మున్సిపల్ కమిషనర్ పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్, తాగునీటి సౌకర్యం లైటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పుష్కరఘాట్ వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన బందోబస్త్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పట్టణంలో 24గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసరాల్లో 24గంటలు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశించారు. అగ్నిమాపక యంత్రం సిద్ధంగా ఉండాలన్నారు. ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఈవో పురేందర్, తాసీల్దార్ మంజుల, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

వైర్ దొంగల పట్టివేత

వడ్డేపల్లి, ఫిబ్రవరి14: మండలంలోని జూలేకల్ స్టేజీలోని మోటార్ల దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి చోరీచేసి కాపర్ వైరును దొంగలించారని బాధితుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని ఏఎస్సై బాషా విచారణ చేపట్టారు. సీఐ టాటాబాబు ఆదేశాల మేరకు విచారణ చేసి దొంగతనానికి పాల్పడిన అనంతపురం జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, మరో వ్యక్తి జార్జ్ దొరకాల్సి ఉందని ఏఎస్సై తెలిపారు. వీరి వద్ద రెండున్నర క్వింటాళ్ల కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నామన్నారు.

యువకుడి ఆత్మహత్య

వడ్డేపల్లి, ఫిబ్రవరి 14: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జూలేకల్‌లో చోటు చేసుకున్నది. ఏఎస్సై బాషా కథనం ప్రకారం మండలంలోని జూలేకల్‌కు చెందిన భాను ప్రసాద్ (18) గురువారం రాత్రి తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడాడు. మృతుడి తల్లి గోవిందమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై కేసునమోదు చేసుకొని మృతుదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు పేర్కొన్నారు.

అనుమానంతో భార్యపై దాడి

• భర్తపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన భార్య

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 14 : భార్య మీద అనుమానంతో భర్త చితకబాధిన ఘటన ఘణపురం తండాలో చోటు చేసుకున్నది. ఎస్సై సురేశ్ గౌడ్ కథనం మేరకు..ఘణపురం తండాకు చెందిన రాత్లావత్ రవినాయక్‌కు అదే తండాకు చెందిన జయతో 17ఏండ్ల కిందట పెండ్లి జరిగింది. వీరికి నలుగురు సంతానం. ఇది ఇలా ఉండగా, కొంత కాలంగా తన భర్త రవినాయక్ తనను అనుమానిస్తూ, శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడన్నారు. దీనిపై గతంలో తండా పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ కూడా జరిగినా, అయినా అతడిలో మార్పు రాకపోగా, ఈ నెల 12వతేదీ రాత్రి తనతో గొడవ పడి కర్రతో తలపై కొట్టాడంతో తీవ్రంగా గాయపడినట్లు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పందుల చోరీ

వడ్డేపల్లి, ఫిబ్రవరి 14 : శాంతినగర్‌లో బుధవారం రాత్రి బొలేరోలో వచ్చి పందులను అపహరించిన ఘటన చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. శాంతినగర్‌లోని రాజోళి చౌరస్తా, తదితర వీధుల్లో తిరుగుతున్న సుమారు 150పందులను కొందరు దుండగులు బుధవారం రాత్రి 12 నుంచి 2గంటల మధ్య బొలేరోల్లో ఎక్కించుకొని తరలించుకెళ్లినట్లు తెలిపారు. అపహరించిన పందుల విలువ రూ.15లక్షలు ఉంటుందని ఆంజనేయులు, తిమ్మ ప్ప, నాగరాజు, రాముడు, సురేశ్, చిన్న తెలిపారు. ఎనుగం డ్ల, ఎమ్మిగనూరు, రాయిచూరు, పుట్లూరు ప్రాంతాల నుంచి వచ్చి అపహరించుకెళ్తున్నట్లు బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న సీఐ టాటాబాబుతో ఎస్సై, ఏఎస్సై, సిబ్బందితో వెంబడించినప్పటికీ దొరకలేదని, ఎరిగెర వైపుగా వేగంగా పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. 50కిలోమీటర్లు వెంబడించినా దొరకలేదని, పైగా రా ళ్లు, సీసాలతో మా వాహనాలపై రువ్వారని వెల్లడించారు.

న్యాయవాదుల నిరసన

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14 : ఈనెల 13వ తేదీ రంగారెడ్డి జిల్లా కోర్టు 9వ అదనపు జడ్జి పి.హరీష్‌పై సర్దార్ కరణ్ సింగ్ అనే నిందితుడు చెప్పుతో దాడిచేయడంతో శుక్రవారం వనపర్తి జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ బార్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ స్వతంత్ర న్యాయవ్యవస్థపై న్యాయాన్ని పరిరక్షించి, అట్టడుగు ప్రజలు, బాధితులకు న్యాయాన్ని అందించే న్యాయమూర్తులపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని, న్యాయమూర్తులకు రక్షణ చట్టాన్ని, న్యాయవాదులకు ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమం లో న్యాయవాదులు వెంకటేశ్, బాలనాగయ్య, హుస్సేన్, మోహన్‌కుమార్, కిరణ్‌కుమార్, అనంతరాజ్, ఆంజనేయు లు, రాంధాళి, రియాజ్ అహ్మద్, చిరంజీవి, భరత్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, బి.ఆంజనేయులు, చందర్‌నాయక్, శ్రీదేవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

అయిజ, ఫిబ్రవరి 14: మండలంలోని రాజాపురంలో గుంటి రంగనాథస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఓపెన్ కబడ్డీ పోటీలు శుక్రవారం కొనసాగాయి. పోటీల్లో తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ర్టాలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు పాల్గొంటున్నారు. విజేతలకు ఆలయ కమిటీ నగదు బహుమతులు అందజేయనున్నది.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

గద్వాలలో అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న పీజీ కళాశాల అధ్యాపకులు

గద్వాలటౌన్, ఫిబ్రవరి 14 : 2019లో పుల్వామా వద్ద జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలు ఎన్నటికి మరువలేనివని పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి అన్నారు. నది అగ్రహారం వద్ద ఉన్న పీజీ కళాశాలలో అమరవీరుల చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరుణాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు , విద్యార్థులు అమరులకు నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు అరవింద్, శ్రీనివాసులు, గోపినాథ్‌రాథోడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి పట్టణంలో..

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14 : పుల్వామాలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీర జవాన్లకు శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జెఎన్‌టీయూ కళాశాలలో అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కమిటీ సభ్యులు అర్జున్ కార్యవర్గ సభ్యులు జ్ఞానేశ్వర్, బాలు, బంటి, వంశీ ఉన్నారు.

పుల్వామా అమర సైనికులకు నివాళి

అయిజ, ఫిబ్రవరి 14: 2019 ఫిబ్రవరి 14న పుల్వామా దాడిలో అమరులైన సైనికుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్, ఉపాధ్యాయులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాల నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు.. దేశ భద్రత, రక్షణకు సైనికులు, జవాన్ల కృషి వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయిజలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మహోన్నత వ్యక్తి సంజీవయ్య

దామోదర సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహనీయుల స్ఫూర్తి వేదిక నాయకులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14: మహోన్నత వ్యక్తి, సమతావాది దామోదర సంజీవయ్య అని మహ నీయుల స్ఫూర్తి వేదిక నేతలు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో దామోదర సంజీవయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 38 ఏండ్ల వయస్సులోనే దళిత ముఖ్యమంత్రిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా , ప్రమోషన్లలో రిజర్వేషన్లకు అద్యుడుగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కవి పండితులు గిరిరాజాచారి, నాయకంటి నర్సింహాశర్మ, మండ్ల దేవన్ననాయుడు, కొమ్ము వెంకటస్వామి, బాలేమియా, మద్దిలేటి, తిరుపతయ్య, వెంకటేశ్, రాంబాబు, రమేశాచారి, రంగస్వామి పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవం

కడుకుంట్ల పాఠశాలలో స్వయం పరిపాలన నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్దమందడి పాఠశాలలో స్వయం పరిపాలన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

వనపర్తి టౌన్/ పెద్దమందడి ,ఫిబ్రవరి 14: వనపర్తి మండలంలోని కడుకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దమందడి మండలంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించి ఉపాధ్యాయ అనుభూతిని పొందారు. కడుకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంగా అఖిల్‌యాదవ్, డీఈవోగా స్వామికుమార్, అదనపు కలెక్టర్‌గా శివశంకర్‌తో పాటు మరికొంత మంది విద్యార్థులు ఒక్కరోజు ఉపా ధ్యాయులుగా వ్యహరించారు. పెద్దమందడి మండల కేంద్రంలో డీఈవోగా కృష్ణ, ఎంఈవోగా సాయిబాబా హెచ్‌ఎంగా వరలక్ష్మీలతోపాటు మరికొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో, జీహెచ్‌ఎం మద్దిలేటి, బండి శ్రీనివాసులు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, ఈశ్వర్, రోజారాణి, సుచిత్ర పాల్గొన్నారు.

జింకను కాపాడిన రైతులు

ఖిల్లాఘనపురం, ఫిబ్రవరి 14 : వీధి కుక్కల బారిన పడిన జింకను రైతులు కాపాడిన ఘటన మండలంలోని మల్కిమియాన్ పల్లి గ్రామ శివారు పిల్లి వాగు సమీపంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. శుక్రవారం పిల్లి వాగు సమీపంలో జింకను వీధి కుక్కలు తరుముతుండగా అటుగా వస్తున్న రైతులు సత్తిరెడ్డి, బిలరాజు కుక్కల నుంచి జింకను కాపాడారు. ఫారెస్టు అధికారులను సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి భాస్కరాచారి బీట్ అధికారి నాగేంద్రం కుక్కల దాడిలో గాయపడిన జింకకు పశువైద్యశాలలో చికిత్స చేయించారు. అనంతరం జంగమాయపల్లి అటవీ ప్రాంతంలో జింకను వదిలేయనున్నట్లు వారు తెలిపారు. జింకను కాపాడిన సత్తిరెడ్డి, బాలరాజును అటవీశాఖ అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

జర్నలిస్ట్‌కు ఆర్థికసాయం అందజేత

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14 : గుండెపోటుతో బాధపడుతూ వనపర్తి ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ బీసన్నకు వనపర్తి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధుగౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల కోసం యూనియన్ పనిచేస్తుందని జర్నలిస్టులకు సహాయ సహకారాలు అందించేందుకు ఎప్పుడూ టీయూడబ్ల్యూజే ముందుంటుందన్నారు. అదేవిధంగా దవాఖాన సూపరింటెండెంట్ రంగారావుకు మెరుగైన వైద్యం అందించాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో పెబ్బేర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పరుశరాం, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి రాజేంద్రప్రసాద్, భాస్కర్ ఉన్నారు.

శనగ పంట పరిశీలన

అలంపూర్, ఫిబ్రవరి14: మండలంలోని భీమవరంలో సాగవుతున్న శనగ పంటను శుక్రవారం ఏవో నాగర్జున్ రెడ్డి పరిశీలించారు. యాసంగిలో గ్రామంలో జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతులకు ఎన్‌బీఈజీ -49 రకం అందజేశామన్నారు. పంట ప్రస్తుతం కోత దశలో ఉండటంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఈ రకం పంట వేరు కుళ్లు, ఎండు తెగులును తట్టుకుని ఆశజనకంగా దిగుబడి వచ్చిందని రైతులు పేర్కొన్నట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి మానస, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు పథకంలో చేరేందుకు నేడే ఆఖరు

గద్వాలటౌన్, ఫిబ్రవరి 14 : తెలంగాణ చేనేత అభయ హస్తం పథకంలో భాగంగా జిల్లాలోని చేనేత, మరమగ్గం అనుబంధ కార్మికులు పొదుపు పథకం చేరేందుకు ఈనెల 15వ తేది చివరి అవకాశమని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సహకార రంగం, సహకారేతర రంగంలో ఉన్నటువంటి వారికి, అనుబంధంగా ఉన్న వారికి పథకం వర్తిస్తుందన్నారు. 18ఏండ్లు నిండి 50శాతం చేనేత వృత్తి నుంచి ఆదాయం పొందే కార్మికులకు పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. అందుకని చేనేత కార్మికులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నిరుద్యోగులకు బాసటగా డీఈఈటీ

గద్వాల రూరల్, ఫిబ్రవరి14 : ప్రైవేట్ రంగంలో ఉద్యోగ కల్పనలో నిరుద్యోగుల డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిలా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టీ.రామలింగేశ్వర గౌడ్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతకు నిరంతర ఉపాధి అవకాశాలను కల్పించేందుకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ఆఫ్ తెలంగాణను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ వినూత్న ఏఐ-ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫారం యువత నైపుణ్యాలను గుర్తించి, అర్హతలకు అనుగుణంగా ప్రైవేట్ ఉద్యోగాలను సూచించడం ద్వారా ఉద్యోగార్థులు, పరిశ్రమలకు కీలక వారధిగా పనిచేస్తుందన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసి ఇతర ఉపాధి కోర్సులు చదివిన విద్యార్థులు డీఈఈటీలో నమోదయ్యేలా చూడాలన్నారు. ఈ యాప్ గురించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ యాప్‌లో వి ద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ రామ్మోహన్, ఐటీఐ ప్రిన్సిపాల్ సత్యానా రాయణ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి ప్రియాంక, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ మహేశ్ కుమార్, అదరపు డీఆర్‌డీవో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు మంజూరు

మల్దకల్, ఫిబ్రవరి 14 : మండలంలోని రెండు గ్రామాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ.20 లక్షలు నిధులు మంజూరు అయినట్లు ఎంపీడీవో ఆంజనేయరెడ్డి తెలిపారు. నాగర్‌దొడ్డి గ్రామానికి రూ.10 లక్షలు, కుర్తి రావుల చెర్వు గ్రామానికి రూ.10లక్షలు సీసీ రోడ్ల కోసం మంజూరైనట్లు ఆయన తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

ధరూరు, ఫిబ్రవరి 14 : పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అందరూ ఉత్తీర్ణులయ్యేలా చూడడం ఉపాధ్యాయుల బాధ్యతని ఎంఈవో రవీంద్రబాబు అన్నారు. మండలంలోని మార్లబీడు గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు అందించే సరుకుల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెగ్యులర్ తాసీల్దార్‌ను నియమించాలి

వడ్డేపల్లి, ఫిబ్రవరి 14 : తాసీల్దార్ ప్రభాకర్ ఉండవెల్లికి బదిలీకాగా అతడినే వడ్డేపల్లి మండలానికి ఇన్‌చార్జిగా నియమించారు. స్థానిక ధ్రువపత్రాల కోసం కార్యాలయ చుట్టూ ప్రజలు తిరుగుతున్నారని, సంతకాల కోసం మండలానికి వెళ్లి రావాల్సి ఉంటుందని దండోరా జాతీయ కార్యదర్శి భీమన్న శుక్రవారం ప్రకటనలో అన్నారు. రెగ్యులర్ తాసీల్దార్‌ను నియమించి ప్రజల సమస్యలను తీర్చాలని కోరారు.

సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

పాన్‌గల్, ఫిబ్రవరి 14 : మండలంలో శనివారం నిర్వహించే సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాల్యానా యక్ గిరిజనులను కోరారు. మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో ఆయన గిరిజనులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ముం దుకు తీసుకపోవాలనే లక్ష్యంతో శనివారం తండాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీతమ్మ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ ఆపాలని తాసీల్దార్‌కు వినతి

ధరూరు, ఫిబ్రవరి 14 : సాదాబైనామా ప్రకారం కొనుగోలు చేసిన భూమిని కొనుగోలుదారులకు కాకుండా మరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకోవాలని తాసీల్దార్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని నీలహళ్లి గ్రామానికి చెందిన వడ్డె ఎల్లప్ప ధర్మన్న అనే వ్యక్తికి చెందిన సర్వే నెంబర్ 338ఈ1బై1బై1లోని నాలుగు ఎకరాల 12గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు పశువుల దొడ్డి కోసం, గ్రామ పెద్దల సమక్షంలో రాత పూర్వకంగా సాదా బైనామాల పద్ధతిలో కొనుగోలు చేశారు. అయితే ఇప్పుడు ఈ భూమిని గుట్టుచప్పుడు కాకుండా వేరే వారికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్న సమాచారం మేరకు గ్రామస్తులు శుక్రవారం తాసీల్దార్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేయకుండా మీరే మీకు న్యాయం చేయాలని కోరారు.

ఏపీఎంగా వెంకటేశ్‌యాదవ్

పాన్‌గల్, ఫిబ్రవరి14: పాన్‌గల్ మండల మహిళా సమాఖ్య ఏపీఎంగా శుక్రవారం వెంకటేశ్ యాదవ్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సక్రూనాయక్ ఆత్మకూర్ మండలానికి బదిలీ కాగా వీపన్‌గండ్లలో పనిచేసిన వెంకటేశ్‌యాదవ్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్వయం సహాయసంఘాల సభ్యులకు అందుబాటులో ఉండి వారికి మెరుగైన సేవలందిస్తాని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

అయిజ, ఫిబ్రవరి 14: మున్సిపాలిటీలోని మాలపేట కాలనీలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నర్సింహులు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది స్తంభాలు ఏర్పాటు చేశారు. గతంలో శిథిలమైన స్తంభాలు తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరామని, అందుకనుగుణంగా వాటిస్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటుచేసి, విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మన్న, చంద్ర, భాషా, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.